
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# గీత

డా. ఎ.పి. వీరేశ్

అప్పుడు మధ్యాన్నం 12 గంటలు. తెనాలి నుండి కొల్లూరు వెళ్ళే బస్సులో కూర్చున్నాను. ఇంకా డ్రైవరు, కండక్టరూ రాలేదు. అసలు తెనాలి నుండి మా ఊరు వరహాపురానికి సరాసరి బస్సు వుంది. కాని అది 2గం.లకు అని తెనాలి యంక్వయిరిలో చెప్పారు. ఈ రెండు గంటలూ, ఇక్కడ వుండి చేసేదేముంది. కొల్లూరు బస్సులో వేమూరులో దిగితే యేదో రిక్షా ఎక్కి మా ఊరు వెళ్ళచ్చు. ఇంకా గంటన్నర అయినా అదనంగా మా అమ్మానాన్నలతో గడిపినట్లు వుంటుంది గదా అని ఈ బస్సు ఎక్కాను.



నిజానికి మా ఊరు వరహాపురమేగానీ, మా నాన్నగారు జిల్లా పరిషత్ ఉపాధ్యాయులుగా వుండడంచేత తరచు బదిలీల వలన మా బాల్యమూ, చదువుతో వేరే ఊళ్లల్లోనే ఎక్కువగా గడిచిపోయింది మా బామ్మ, తాతయ్యలు వరహాపురంలోనే వుండడం వలన పండగలకు, సెలవలకు వస్తూ పోతుండే వాళ్ళం. ఆ పిదప కాలేజీ చదువులు. యం.బి.బి.యస్ గుంటూరులోనే చదవడం, అప్పుడు పండగలూ సెలవలూ వచ్చినప్పుడు మా నాన్నగారు పని చేస్తున్న ఊర్లకు వెళ్ళడం, మొత్తం మీద మా వరహాపురం మాకు పూర్తిగా తెలియదు. అక్కడ మాకు నాలుగయిదెకరాల పొలం. ఒక పెంకుటిల్లు వుంది. మా నాన్నగారు

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

రిటైరైన తర్వాత వరహాపురంలో ఇంటిపట్టున ఉంటున్నారు గనుక ఒక ఆదివారం వాళ్ళను చూసొద్దామని బయలుదేరాను. మా ఊరిలో 'కచేరి సావిడ' ని వుండేది. వ్యవసాయ పనులు లేని తరుణంలో పెద్దా, చిన్నా పేకాడుకుంటూనో, జనప నార తాళ్ళు పేనుకుంటూనో కూర్చునేవాళ్లు. ''ఇదేనా అండీ రావడం'' అని వాళ్ళడగడం.

''ఆ యిదే!'' అని రిక్షాలో వుండే సమాధానం యివ్వడం

''రెండురోజులుంటారా?'' అని వాళ్ళడగడం.

''లేదు రాత్రికి మళ్ళీ వెళ్ళిపోతానని'' నేను చెప్పడం మామూలు.

డాక్టర్ని గనుక అవునన్న కాసేపటిలోనే అవసరాన్ని బట్టి, ముగ్గురో నల్గురో వైద్య సలహాల నిమిత్తం వస్తుండేవాళ్లు.

డ్రైవరూ, కండక్టరు ఎక్కారు. బస్సు కదిలింది.

అప్పుడు నా కొక అనుమానం వచ్చింది. తీరా వేమూరులో గూడు రిక్షాలు లేకపోతే! భోజనాల వేళయిందని, రిక్షావాళ్ళు తోలరేమో! లేదా పనుల తరుణంగదా! వరహాపురానికి బస్సు పడ్డ తర్వాత ఇంతకంటే పొలం పనికి వెళ్తేనే గిట్టుబాటు అని రిక్షా వాళ్ళు కూడా పొలం పనికి వెళ్తారేమో! అంతకంటే పెద్ద సమస్య అప్పటికి లేదు గనుక, ఆ ఆలోచనలోనే మునిగిపోయాను. నా వెనక సీటు వద్దకు కండక్టరు వచ్చినట్లున్నాడు.

''ఏ ఊరు'' కండక్టర్ అడుగుతున్నాడు.

''ఏమూరు'' సమాధానం.

''నాల్గున్నరతియ్'' కండక్టరు.

''ఆ ఎనక సీట్ల అదుగో 'మఖరాణి' (మహారాణి) వుందిగా టిక్కటీలు కొట్టించలా''!

'మఖరాణి' నాకు ఆసక్తి తో పాటు కొంచెం నవ్వూ వచ్చింది. వెనక్కి తిరిగి చూశాను. బాగా వెనకసీట్లో కూర్చున్న ఒకామె ''మూడు టిక్కటీలు తెంపెంచితినే, నాకు ఆ ముసలాయనకూ, అదుగో అక్కడ నిలబడ్డారే బిడ్డతల్లి, దానికే'' అని అంది. నా వెనక సీట్లో వున్న ఆ ముసలాయనకు డెబ్బయి అయిదేళ్ళుంటాయి. మనిషి గట్టిగానే వున్నాడు. నల్లని ముఖం మీద, పదిహేను రోజులు పెరిగిన తెల్లని గడ్డం. తెల్లని కనుబొమ్మలు. ముఖానికి బాగానే అమరినట్టున్నాయి. చేతి కర్రమాత్రం ఆయన సీటు పక్కనే కింద పెట్టి ఉంది.

''ఇదుగో పిల్లా! అట్టా బిడ్డనెత్తుకుని నిలబడే బదులు ఆ సీటు మీద ఇద్దరే గాదా కూకుంది. ఆల్లిద్దరినీ కూసింత జరగమను. మరి బొత్తిగా నోట్లో నాలిక లేకుంటే యట్టాగే?'' అని ఆ సీటుపై కుర్చున్న వాళ్ళతో కూసింత జరగండమ్మా. బిడ్డనెత్తుకు యెట్టా నిలబడుద్ది?'' అన్నాడు. వాళ్ళూ సర్దుకు కూర్చున్నారు. ఆ బిడ్డ తల్లీ ఒదిగి కూర్చుంది.

వెనక సీట్లో సంభాషణ మొలయింది.

''శానాకాలానికి కలిశావురా అల్లుడా! ఆc ఇప్పుడు సెప్పు! ఏంది సెప్తున్నావు? అమ్మ అయ్య జరిగిపోయారా''

''మూడేళ్ళయింది మావా! మాకడగొట్టు తమ్ముడి పెళ్ళిసేసి. నాలుగయిదు నెలల తేడాతో పెళ్ళయినా యేడాదిలోనే కాలం చేశారు!'' ఆ రెండో వ్యక్తి మాటల్లో కాస్త నాగరీకం కనిపిస్తున్నది.

''అయితే బరువు బందాలన్నీ దించుకున్నంకే నన్నమాట! పోనీలే! దిగుల్లేదు. మీ అయ్య నా కంటే మూడు నాలుగేళ్ళు పెద్దాడనుకుంటా. సిన్నప్పుడు ఆడకొచ్చినప్పుడు నుంచి సావాసగాల్లమే! ఎప్పటికైనా యెల్లి పోవలసినోళ్ళమే గదా! అయినా అల్లుడా జంటలో ఒకల్లుండి ఒకల్లుపోతే దిగులుపడాల నిజం సెప్పమంటావా! అసలు ఈ వొయిసులోనేరా తోడూ జోడూ కావల్సింది! మంచి వొయిసు మీదన్నప్పుడు యెట్టా అయినా జరగిపోద్ది!'' అంటూ బిగ్గరగా నవ్వాడు.

వాళ్ళిద్దరూ బస్సులో వున్నది తామిద్దరే అయినట్లు ఎవరేమనుకుంటారో అన్న ఆలోచన లేకుండా బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు.

''అది సరే గానీ మావా వరహపురానికి సరాసరి బస్సుందిగా. ఇదెందుకెక్కావు''

''వుంది గానీ ఇంకా రెండుగంటలకు గానీ రాదంట. ఇక్కడ ఈ బస్సు టేషన్‌లో కూకునే బదులు ఏమూరిలో దిగినాలుగడుగులేత్తే సరి! యిప్పుడయితే, బస్సులయీ వచ్చినయిగానీ పాతికేళ్ల క్రితం దాగా అట్టాగే మోకాటిలోతు బంకనేల బురదలో లాక్కుంటూ, పీక్కుంటూ నడిసేటోల్లమే గదా!''

''అప్పుడు సరే ఇప్పుడు ముసలిడివి గాలా?''


''ఎంత ముసిలోన్నయినా ఆ మాత్తరం నడవలేనంత గాలేదులే!'' అని తనకర్రను చూస్తూ ఈ మూడో కాలు వుండాలేగానీ, మూడు మైళ్ళైనా వడిగానే నడుత్తా'' అంటూ మళ్ళీ నవ్వు!

''అయినా వరహాపురం బస్సులో జేరినా, మళ్ళీ మా పల్లెకే, ఇందులో సగం దూరం యెటూ నడవాలిసింది. అడ్డంబడి యెల్తే అంతే అవుద్ది'' ముసలాయన సమాధానం.

నా సమస్యకు పరిష్కారం చెప్పాడనిపించింది. నిజమే రెండుమూడు కిలో మీటర్లు నడవలేనా? రోజూ 'మార్నింగ్ వాక్' కు యింతకంటే కొంచెం యెక్కువే నడవడం లేదా? ఇప్పుడు మధ్యాన్నమే అయినా మబ్బులుపట్టి వాతావరణం చల్లగానే వుంది. నడవలేక కాదు. ఇప్పటి హోదా అట్టానడవనివ్వదు. వెనకసీటులో మళ్లీ బిగ్గరగా సంభాషణ! ''మావా అసలు మీ ఊరు వరహపురం గాదంటగా మా అయ్య చెప్పేవోడు''.

''కాదంటే కాదు. ఔనంటే అవును. మా తాత మా నాయన సిన్నతనాన పొట్టసేత్తో బట్టుకుని. అదే పరమట మాసెర్ల నుండి వరహపురం వలసవచ్చిండంట! ఎందుకనో ఇప్పటికీ యెప్పుడయినా పానం అటుగుంజుతుంటది. మనోళ్లో ఆడనేవున్నారు గదా అని అనిపిస్తది. నేను వరహపురంలోనే పుట్టిపెరిగినా ఊగ తెలిసిందీ సిన్నతనాన ఆడిందీ, పాడిందీ, బువ్వ సంపాయించటం నేర్పిందీ, బువ్వతింటున్నదీ యీడనే!''

''అయితే ఇక్కడనే నా ఊరంటూ వుండిపోవడమేనా?''



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

''అంతేరా అల్లుడా! నాది అని సెప్పుకునేందుకే, ఆ ఊర్లో కుంటభూమి, సెంటునేల ఒక గుడిసే యేదీలేనోణ్ని ఏ ఊరు నీదంటె యేమని సెప్పాల? ఇంత బువ్వ కూడ దొరకని ఊరు వానికి వుండేం లేకేం?''

ఎంత నగ్న సత్యం. ఎంత సాదాసీదాగా చెప్పాడు! ఊరేలేని వాడికి దేశం మాత్రం యేముంటుంది?! అందుకే రెక్కలు తప్ప కష్టం చేసుకుని కడుపు నింపుకోలేని వారిని దేశాల హద్దులు చెరిపేసి, అంతర్జాతీయ కార్మికులారా ఏకంకండి! అని మార్క్స్ మహనీయుడు పలుపునిచ్చాడు! నా ఆలోచనలు యిక ఆ దిశగా సాగుతున్నాయి.

''ఏందే పిల్లా అట్టా వొల్లుమరిసి కునుకు తీత్తన్నావ్? చేతిలో పిల్ల జారిపోద్ది. జాగరత్తగా కూకో! అంత అపుకోలేకపోతే ఆ సంటిదాన్ని నాకియ్యి! అంటూ కోడలిని మందలిస్తున్న ముసలాయన మందలింపుతో మళ్ళీ బస్సు లోకం లోకి వచ్చాను. ఆ బిడ్డతల్లి 'ఒద్దులే' అంటూ సర్దుకు కూర్చుంది.

''పెద్దోల్లిద్దరికీ అప్పసెల్లల పిల్లన్నేజేసుకున్నా! మూడోవాడికి మా తమ్ముని మనవరాలనే జేసుకున్నా! ఇదుగో యిదే ఆ పిల్ల!''

''మరి అమ్మాయిని?''

''అమరతలూరిచ్చినా అల్లుడు శానామంచోడు! పిల్లని పానంగా సూసుకుంటాడు''

''అంతేలేమనా! అంతకన్న ఆడపిల్లను కన్నాళ్లకు కావలసిందేముంటది?''

''అదిసరే, ఎవురిది వాళ్ళకు పంచిచ్చినవా?''

''నేనిచ్చేదేంది? ఆల్లే తలా యెకరం దీసుకుని మా ముసల్దానికి నాకు ఎకరం మా గుడిసె, అట్టే పెట్టారు. ముగ్గురూ గూడ పూరిల్లయినా సౌక్యరంగా యేసుకున్నారు. మా అయ్య యెకరంన్నర వదిలిపోయిండు. మా రెక్కల కట్టం మీదనే ఇంకో రెండున్నర కొనుక్కునాం! మా యత్త తెలివిగలది ఇద్దరు మొగాల్ల కట్టంజేసుద్ది'' అంటున్న ముసలాయన వైపు చూశాను. ఒక విధమైన సంతృప్తితో గంభీరంగా హాయిగా కనిపించింది.

''మరా మా ఊర్లో ఎకరం ఎంత జేసుద్ది?''

''రెండున్నర అన్నా అమ్మేటోడులేడు! అయినా యియాల రేత్రి లచ్చాంటే లెక్కేముందిలే ముప్పై యెల్లకాడ పాతికేలు బెట్టి ఎకరం కొనాలంటే శాన మదనపడినా! సేతిలో పదెనేలున్నయి! ఇంకో పదేలు యాడ అప్పుదేవాల, అప్పెట్టా దీర్చాలా అని''

''ఆ రోజులు గామట్టే కొన్నావు. ఈ రోజుల్లో అయితే కొనగలవా?''

''నాకట్టా అనిపించదురా అల్లుడా! ఆ మాట కొత్తే అప్పుడు బత్తా దాన్నెం యెంతుండేది. మగా అయితే పాతికో ముప్పయ్యో! అప్పుడు నాలు గొందలు పైమాటేగదా''

''నువ్వెన్నైనా జెప్పుమావా! ఎట్టా అయినా ఆ రోజులు వేరే!''

''నేనొప్పుకోనురా అల్లుడా! అప్పుడుండే కట్టం సుఖం, అప్పుడు లేవా? వుప్పుడుంటే కట్టసుకం వుప్పుడూ వున్నయ్యి! అంతెందుకురా ఆ రోజుల్లో, ఒక సలిజరమో, మసూచికమో తగులుకున్నదంటే ఊల్లకు ఊల్లే మాయమయ్యేవి''

''అయితే అత్తా, నువ్వూ కట్టం జేత్తానేవుంటారా యింక?''

''కట్టం సేయమనెకదరా, బగమంతుడు మడుసుల్ని లోకం మీనలోకి పంపింది?''

''అయినా వుప్పుడు మగోల్లు మొనగాల్లయినరుగా! ఆల్లే యెగసాయం అదీ జేసిపెడతంటారు. ఎన్నడైనా, మీ అత్తకు నలతగా వుంటే కోడల్లే కూరో నారో శారో సేసి, వన్నంవండి పంపిత్తుంటారు, కాలం కలిసొచ్చి వొల్లుదగ్గర బెట్టుకుని, శ్రద్దగా సంటిపిల్లను సాకినట్టు సాకితే, ఎకరాకి ముప్పై బత్తాలు వడ్లు మూడు బత్తాలు మినుములూ అవుతాయి''

''అయితే మావా అంతా సౌక్యంగానే వుందంటావు''

''అంతెక్కడరా అల్లుడా! మనం వోరి దగ్గరా సెయ్యి సాపకుండా గీరకంగా బతుకుతా వుంటా. యెవురైనా ఆకలి అని వాకిట ముందుకొత్తే ముద్దన్నం పెట్టగలిగితే సాలు! యేవంటావు? అయన్నీయేందిగానీ పిల్లగాల్లురా! నా మనవలు! అచ్చం సిన్ని కిట్టయ్యవే అనుకో! ఆల్ల అల్లరీ, ఆటలు సూత్తావుంటే తాతగానోడి బతుకు దండగ నిపిత్తదిరా! అదీ కావలసింది. అంతకన్నా యే గొప్పోరు మాత్తరం ఏం గనకార్యం సేత్తరు!''

ఇంతలో ఆ ముసలయ్య మనమరాలు యెందుకో యేడవసాగింది. కోడలు ఆ పిల్ల యేడుపు మానిపించేందుకు తంటాలుపడుతున్నది.

''ఏందే పిల్లా అట్టా సూత్తావు. రొమ్ము దాన్ని నోట్లో బెట్టకా?'' ఆ కోడలు సిగ్గుతో తటపటాయిస్తున్నది.

''ఒహో! బస్సు అని సిగ్గా? ఈ బస్సులో వున్నాళ్లలో తల్లికాడ పాలు తాగని వోల్లెవలో జెప్పమను'' అని గదమాయించి తల్లిపాలంటే గురుతొచ్చింది అన్నట్టు ''అల్లుడా పటమటన, కరెంటుతో యెగసాయమే గదా!''

''అవునే మావా!''


''సేనుకయినా సెట్టుకయినా అంతేరా బగమంతుడు దయజూసి. మబ్బులకు సిల్లుపడి వరాలు కురిపాల! యెంతయినా తల్లిపాలు తల్లిపాలే పోతపాలు పోతపాలే!''

''నిజమే మాకాడ వర్షాలు సరిగ్గా పడవు మరి యేం జేత్తాం ఈ యేడు పరవాలేదనుకో''

''అదెరా! వానదేవుడు కాంగిరేసుపార్టీలో జేరిండంటగా మన ముక్యమంత్రి సెవుతున్నాడు ఆమద్దన మా సిన్నాడు ఒక సిన్న బొమ్మల పెట్టి కొనుకొచ్చి యింటో పెట్టాడు'' అంటూ బిగ్గరగా నవ్వాడు ఆ ముసలాయన.

''ఆయన్నీ రాజకీయాలులే మావా మనకెందుకు?''

''ఉప్పుడు సూత్తంటే అట్టనే



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत • उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

వుందనుకో. మా సిన్నతనాన గాంధీగోరంటే యెంత బక్తి ఆయన్ను సూసేందుకే నాకు పదేల్లప్పుడు మా పిల్లలం పెద్దలం, తెనాలి దాకా నడిచే పోయినం! అదీ రాజకీయం అంటే ఆయన మఖానుబావుడు! మాకు పాతికేళ్లప్పుడు సుందరయ్య! కమ్యూనిట్టు నాయకుడు! ఆయనంటే గాంధీగారంత కాకపోయినా, శానా వూపుండేది. గొప్ప మడిసి! పాతికేల్లనాడు రామారావొచ్చిండు. అదొక జాతర! రాజకీయాలంటే అయిరా! వుప్పుడు అందరందరే ననుకో'' ఆ ముసలయ్య మాట పూర్తి కాకుండానే

''వేమూరు దగ్గరకొచ్చాం. చెప్పుకున్న కబుర్లు చాలుగానీ దిగి మెల్లిగా తలుపు దగ్గరకు రా!! ముసలయ్యా! వేమూరులోనేగా దిగేది?'' అని కండక్టరు హెచ్చరించాడు.

''దిగుతూనే అయ్యా! నన్ను దించకుండానే కొల్లూరు బస్సులాగిత్తావా'' అంటూ లేచి వంగి కింద కర్ర అందుకుంటూ.

''ఇదుగో అమ్మాయి బస్సు ఆగీ టప్పుడు కుదుపుద్ది! సంకలో పిల్లుంది అడావుడి లేదు బస్సు ఆగినంక నింపాదిగా, దిగు'' అంటూ కోడలిని హెచ్చరించాడు

ఆ పక్కనున్నాయన ''మెల్లంగా దిగుమావా! అసలే పెద్దోడివి యేకాలో, సెయ్యో'' అని అన్నాడు.

''అట్ట జరగాలనుంటే ఆరోజొత్తే మనం ఆగమన్నా ఆగుద్దా?''

''ఒకసారి మనేపుకు రారాదంటే మావా?''

''వొద్దామనే వుంటదిరా! ఏది! నార్లు బోశామా, నాట్లు, కలుపులు, మందులు యెరువులు నీళ్లు కొట్టుకోడం కోతలు కుప్పలు నూర్పిల్లు ఆపై మినుములు జల్లుకోడం ఈ రంగుల రాట్టం యిట్టాతిరుగతనే ఉంటుంది! అయినా యీలుసూసుకుని ఒకసారి నేనూ మీ అత్తా వత్తాములే'' అంటున్నాడు.

అక్కడ ఒక గూడు రిక్షా ఆగి వుంది. బస్సు దిగి నేను వెళ్ళి ''వరహాపురం వస్తావా?'' అని అడుగుతున్నాను. ఆ కర్రపోటేసుకుంటూ ఆ ముసలయ్య నా దగ్గరకొచ్చాడు.

''వరహాపురమా ఓరి తాలుకు తవరు?''

''ఉదయమ్మగారి మనవణ్ణి'' నా దృష్టిలో మా నాయనమ్మే 'పాపులర్' అని!

''అట్టాసెప్పు అయితే ఆకురిత్తి రామయ్యగారి మనవడివంటయ్యా తమరు? పెద్దాయన వా? సిన్నాయనవా? ఇద్దరూ డాట్టర్లేనంట గదా!''

''పెద్దవాణ్ణే''

''ఓసోసి! అయితే యిటలయ్యిగారివన్నమాట! సెప్పుకోంగా యినడలే గానీ వుప్పుడే పెత్తెచ్చంగా సూడడం. నీకు మంచోడివని మంచి వైద్దుగుడివని శానా పేరుందయ్య ఏ మాటకామాటే సెప్పుకోవాలి ఇదంతా మీ తాతగారు సేసుకున్న పూజలు పలమేనయ్యా ఆయన సేతిలో మనూరి దేవాలయంలో సివలింగం సగం అరిగందంటయ్యా పిల్లలు లేకపోతేనేం మీ నాయన గోరిని దత్తు తెచ్చుకోనే ఆయనకు గంపెడు సంసారం అయిందీ. అంతా గవురవంగా బతుకతా మంచి మడుసులని పేరుదెచ్చుకుంటాన్నారు. మీ తాత గారు రామయ్యగారు 'మఖానుబావుడు' తాతగారికి తగ్గ'' అని యేదో అనబోతున్నాడు నేనే ఆ పొగడ్తల ధోరణి మారుదామని

''ఇందాక 'మఖారాణి''

''అవునయ్యా మా ముసల్ది నా మేనమామ కూతురే దానికి ఆల్లయ్య తెల్లాళ్ళ రానీ పేరు 'విక్టోరియా రాని' అనిపేరు పెట్టుకున్నాడు. దాన్నే నేను 'మఖారాణీ' అంటుంటా. అది మఖరాని గావడంతో నేను మగ రాజునయినా!! వుప్పుడంతా మనూళ్లో నన్ను 'గంగరాజు' అంటారు గంగయ్యనయితే'' అని నవ్వి

''ఏమీ అనుకోబాకండి యిట్టా అడిగానని తవరు మా పేరున్న వైద్దుగారు సంతోషమే! ఆవైద్దగం యేదో మనూళ్ళో సెయ్యిరాదయ్యా. పుట్టినూరు కన్నతల్లి సమానమంటారు'' అన్నాడు. ఈ వూహించని ప్రశ్న ఏం చెప్పాలో అని కంగారుపడుతున్నాను.

మళ్ళీ 'గంగరాజే' ''ఏదో అట్టా అడగాలనిపించి అడిగానయ్యా మీ కున్న యిబ్బందులేవో మీకు వుండేవుంటాయి. అయినా ఆ యేమన అన్నట్టు ఎవ్వరైనా మెతుకు బంగారం మింగరు గద బాబూ అందులోనూ తవరు పేదోల్లంటే వల్లమాలిన అభిమానంగా సూత్తారంట, మా పల్లెలో అందరూ సెప్పుకుంటారు'' అని ముగించాడు.

మా ఇరువురిదీ వరహాపురమే! ఈ గంగరాజును గురించిగానీ అతడి కుటుంబం గురించి గానీ నాకేమీ తెలియదు. కాని గంగరాజుకు మా వంశవృక్షం మొత్తం తెలుసు! నేను విద్యావంతుణ్ని! నాగరీకుణ్ణి! గంగరాజు విద్యావంతుడు కాదు. అనాగరికుడు! నాకున్నట్లే పరిసరాలలో వున్న అన్నింటి పై గంగరాజుకు స్పష్టమైన స్వీయ అభిప్రాయాలున్నాయి. వుండడమే గాదు. వాటిని స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తున్నాడు గదా! దాచుకోవడం. భావాలకు ముసుగు లేయడం తెలియని 'అనాగరికుడు' ప్రపంచం దాని పోకడలు తెలిసి కూడా సంతృప్తిగా సంతోషంగా జీవిస్తున్నాడు! ఒక విద్య (అదీ చదువు విద్య) లో తప్ప అన్నింటా నా కంటే పెద్దవాడు. అయినా నన్ను గొప్పచేసి గౌరవిస్తున్నాడు. అన్నింటికీ మించి యే సంకోచాలూ శషబిషలు లేకుండా, నాకు కర్తవ్య బోధచేశాడు! నిజమైన మహానుభావుడు! గంగరాజు వుచ్చారణలో చెప్పాలంటే అసలైన మఖానుబావుడు!

